''ఛీ! నువ్వసలు మనిషివేనా? మామయ్య నాకు తండ్రిలాంటి వాడు. ఆయనతో ఇలాంటి సంబంధం.. ఎంత నీచంగా ఆలోచిస్తున్నారు? భగవంతుడా! ఈ పురిటిలోనే నన్ను చంపేయాల్సింది. ఎందుకు బతికించావు?''.. శారీరక బాధకన్నా, గుండెను గునపాలతో గుచ్చిన ఆ మాటలతో తట్టుకోలేక పైకి గుండెలవిసేలా పొగిలి పొగిలి ఏడ్చాను.

''నామీద ఒట్టేసి నిజం చెప్పు! నేనేమీ అనుకోను. మా నాన్న మంచివాడు కాదు. ఎప్పుడైనా ఏదో బలహీన క్షణంలో ఏమైనా కాలు జారారా!? అందరూ వాడు అచ్చం మా నాన్నలా ఉన్నాడంటున్నారు. వాడూ అచ్చం అలాగే ఉన్నాడు. నేనేమీ అనుకోను. ఏదైనా బలహీన క్షణంలో ఏమైనా జరిగిందా?'' అంటూ.. గుండెలవిసేలా ఏడుస్తున్న నన్ను చూస్తూ, పదేపదే అడుగుతున్న ఆయన మాటలకు లేని బలం తెచ్చుకుని, కత్తికొక కండగా నరికేయాలనిపించింది. అవి మాటలా? కాదు ఈటెలు. పదునైన బాణాలు. పచ్చి బాలింతను ఎవరైనా పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. అప్పుడు ఏడవకూడదని అంటారు. ఎక్కువగా ఏ పనీ చేయకూడదని చెబుతారు. అలాంటిది.. నాకు తీరని శోకం పెట్టాడు.

కొన్నినెలల వరకు ఇద్దరినీ చూసుకుంటూ నేను ఉద్యోగం చేయలేకపోయాను. అప్పుడే ఆ తీవ్ర మానసిక వేదనకి నేను డాక్టర్ దగ్గరికి వెళ్తే.. క్రాన్స్ వ్యాధి బయటపడింది.


''అది నివారణ లేని వ్యాధి. ఎట్టి పరిస్థితుల్లో మానసిక స్ట్రెస్ ఉండకూడదు. అది లేకుంటే.. ఇదికూడా త్వరగా తగ్గుముఖం పడుతుంది'' అంటూ చెప్పి.. డాక్టర్ రాసిన మందులకి ప్రతినెలా ఎంతలేదన్నా కనీసం నాలుగువేల వరకు ఖర్చు అయ్యేవి. చాలా నెలల వరకు మా అమ్మవాళ్లే పెట్టుకున్నారు. కానీ, నాకే అలా ఇష్టంలేక ఆయన్ని అడిగితే..

''ఉద్యోగం చేస్తావో.. ఇంకేం చేస్తావో నాకు అనవసరం. కాలేజ్‌కు వెళ్లి.. 'బాబూ.. ఉద్యోగం ధర్మం చేయండి. నాకు మందులు కొనుక్కోవడానికి డబ్బులు లేవు' అంటూ అడుక్కోపో!'' అనేవాడు. ఆయన జీతం లకారానికి దగ్గరగా ఉన్నా, ఎప్పుడూ నాకు చెప్పేవాడు కాదు. నా పిల్లలకు నేను దక్కాలంటే ముందు ఆర్థికంగా నా కాళ్లపై నేను నిలబడాలని కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా మళ్లీ జాబ్ సంపాదించుకున్నాను.

* * *

పాపకి యూనిఫాం చినిగిపోవడం వల్ల స్కూల్లో నిలబెడుతున్నారని తెలిసి.. కొనుక్కొని వచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటిపోయింది. చార్జింగ్ లేక నా ఫోన్ స్విచ్ఆఫ్ అయింది. ఇంటికి రాగానే చేయిని వెనక్కి వడితిప్పి..

''ఎవడితో కులుకుతున్నావే? ఇప్పటివరకూ ఏ రంకు మొగుడి దగ్గరికెళ్లి వస్తున్నావు?'' అంటూ పిల్లల ముందే నానా దుర్భాషలాడాడు. కిందికి వంగోబెట్టి.. వీపు మీద దబా దబా బలంగా గుద్దాడు. ఆయనొక శాడిస్ట్. దానికితోడు నేను అందంగా ఉండటం కూడా.. నా పాలిట శాపమయ్యింది.



* * *

''హడావుడిలో మీకు స్నాక్స్ పెట్టడం మర్చిపోయాను''.

''ఎలా గుర్తుంటుంది? ఎవడెవడినో 'ఆరోగ్యమెలా ఉంది!?' అని అడగడానికి సమయం ఉంటుంది కానీ.. కట్టుకున్నోడెలా గుర్తుంటాడు? ఊరంతా రంకు మొగుళ్లే! పెళ్లికానోడితో ఇకఇకలు పకపకలు, షేక్ హ్యాండ్ లేంటి? ఇదంతా ఫోన్ వరకేనా, వ్యవహారం బయట తిరగడం వరకూ వెళ్లిందా?''.

మా ఫ్యామిలీ ఫ్రెండ్ కార్డియాలజిస్ట్ అయిన డా. శ్రీనివాస్ గారికి ఆరోగ్యం బాలేదని అమ్మ చెబితే.. మెసేజ్ పెట్టాను. ఆయన.. 'ఫైన్! థాంక్యూ ఫర్ యువర్ కన్సర్న్' అంటూ నవ్వుతున్న బొమ్మ, షేక్ హ్యాండ్ ఎమోజీ పెట్టారు.

**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో విశిష్ట బహుమతి పొందిన కథ.**